# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-12-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భారత రాజ్యాంగ స్ఫూర్తితో దేశాన్ని వికసిత భారత్ గా తీర్చి దిద్దుతామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి చేయూత నిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు హామీ ఇచ్చారు.**
3. **తెలంగాణా రాష్ట్రంలో ప్రతిభ సాధించేలా గురుకులాలను ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
4. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా జరగనున్నాయని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు.**
5. **తెలంగాణా రాష్ట్రంలో గ్రూప్ - 2 పరీక్షలు ఈ రోజు, రేపు జరగనున్నాయి.**
6. **ఆధార్ కార్డు వివరాలను ఉచితంగా మార్చుకునే గడువును వచ్చే ఏడాది జూన్ వరకు పొడిగించారు.**

==========================

భారత దేశ ఐక్యతకు రాజ్యాంగమే మూల స్తంభమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగం 75 ఏళ్ల ఉజ్వల ప్రయాణంపై లోక్ సభలో రెండు రోజుల పాటు జరిగిన ప్రత్యేక చర్చకు నిన్న ఆయన సమాధానం చెబుతూ .... భిన్నత్వంలో ఏకత్వం అన్నది మన దేశ విశిష్ట లక్షణమని అన్నారు. ఎన్.డి.ఎ. ప్రభుత్వం చేపడుతున్న విధానాలు ...., తీసుకుంటున్న నిర్ణయాలు దేశ ఐక్యతను బలోపేతం చేసే దిశగా ఉన్నాయని చెప్పారు. ఒకే దేశం –ఒకే పన్ను ..., ఒకే దేశం – ఒకే రేషన్ కార్డు ...., ఆయుష్మాన్ కార్డు వంటి కార్యక్రమాలు దేశం శరవేగంగా అభివృద్ధి సాధించడానికి దోహదం చేస్తున్నాయని నరేంద్రమోదీ పేర్కొంటూ ......

..వాయిస్... 30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం పూర్తి సహకారం అందజేస్తుందని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

చెత్త నుండి విద్యుదుత్పత్తి చేసే సంస్థలు  ఎస్.ఎ.ఈ.ఎల్..., నార్ఫండ్ ...., ఎన్.డి.బి.  ప్రతినిధులు నిన్న అమరావతిలో తనను కలుసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... హరిత ఇంధన విధానం అమలు చేసే కార్యక్రమంలో భాగంగా ఈ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపామని చెప్పారు. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులను స్వాగతిస్తున్నామని ..., చెత్త నుండి విద్యుత్ ను  ఉత్పత్తి చేయడానికి అనుసరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎస్.ఎ.ఈ.ఎల్. సంస్థ ప్రతినిధులు వివరించారని ఆయన చెప్పారు. వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి రైతుల ఆదాయం పెంచే ఈ తరహా ప్రాజెక్టులను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

----------------------------

తెలంగాణా రాష్ట్రంలో  గురుకులాలను  మంచి ప్రతిభ సాధించే విధంగా ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు.

రంగారెడ్డి జిల్లా చిలుకూరులో గురుకుల పాఠశాలను నిన్న సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... రాష్ట్రంలో గురుకుల బాట కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు.  కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆహార చార్జీలను 40 శాతం మేర పెంచిందని రేవంత్ రెడ్డి పేర్కొంటూ.........

వాయిస్... 25 సెకన్లు

----------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా జరగనున్నాయని పురపాలక ...., పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.

రాజధాని పరిధిలోని రహదారులను జాతీయ రహదారికి అనుసంధానించే ప్రాంతాలలో నిన్న ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి  పాత్రికేయులతో  మాట్లాడుతూ .... రాజధాని నిర్మాణాల కోసం 22 వేల కోట్ల రూపాయల మేర పనులు చేపట్టేందుకు అనుమతి మంజూరైందని చెప్పారు. రేపు జరిగే రాజధాని ప్రాంత ఓప్రాధికార సంస్థ సమావేశం మరొక 20 వేల కోట్ల రూపాయల మేర పనులకు ఆమోదం తెలియజేస్తుందని నారాయణ పేర్కొంటూ.....

..వాయిస్...29 సెకన్లు

----------------------------

తెలంగాణా రాష్ట్రంలో  గ్రూప్ – 2 సర్వీసులో  783 పోస్టుల భర్తీకి  ఈరోజు ..., రేపు పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక వెయ్యి 368 కేంద్రాలలో ఈ పరీక్షలు రెండు విడతలుగా ఉదయం పది నుండి మధ్యాహ్నం పన్నెండు గంటల 30 నిముషాల వరకు ..., మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు జరుగుతాయి. హాల్ టికెట్‌తో పాటు అభ్యర్థులు ప్రభుత్వం జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డు తీసుకురావాలని టి.జి.పి. ఎస్. సి. ఒక ప్రకటనలో తెలిపింది. అభ్యర్థులందరూ బయో మెట్రిక్ తప్పనిసరిగా వేయాలని ..., లేని పక్షంలో ఓ.ఎం.ఆర్. పత్రాల మూల్యాంకనం చేయబోమని స్పష్టం చేసింది..

----------------------------

తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు … చలన చిత్ర నటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావును స్ఫూర్తిగా తీసుకుని తెలుగు జాతికి ప్రపంచ ఖ్యాతి తీసుకు వస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

కృష్ణా జిల్లా పోరంకిలో నిన్న జరిగిన ఎన్.టి.ఆర్. సినీ వజ్రోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ …. సినిమాలలోపాత్రకు ప్రాణం పోసిన ఏకైక నటుడు ఎన్.టి. రామారావు అని అన్నారు. వైవిధ్యభరితమైన పాత్రలలో నటించి ప్రజలను మెప్పించారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ….తెలుగు భాషాభివృద్ధికి ఎన్.టి.రామారావు కృషి చేశారని … ఆ స్ఫూర్తిని మనం కొనసాగించాలని సూచించారు.

---------------------------

ఆధార్ కార్డులో వివరాలను ఉచితంగా మార్చుకునేందుకు ప్రస్తుతం ఉన్న గడువును భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ …. U I D A I …. వచ్చే ఏడాది జూన్ 14 వ తేదీ వరకు పొడిగించింది. ఆధార్ కార్డులో చిరునామా …, ఇతర మార్పులు చేసుకోదలచిన వారికి ఈ గడువు పొడిగింపు వల్ల వెసులుబాటు లభిస్తుందని ఎక్స్ వేదికగా U I D A I పేర్కొంది. నిబంధనల ప్రకారం ప్రతి పదేళ్లకు ఒక సారి ఆధార్‌కు సంబంధించిన వివరాలను సరిచేసుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం ఈ గడువు నిన్నటితో ముగిసింది.

---------------------------

“” ఒకే దేశం- ఒకే ఎన్నికల”” కు సంబంధించిన రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వం రేపు లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నది. ఇందుకు సంబంధించిన రాజ్యాంగం 129 వ సవరణ బిల్లు …, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ రేపు లోక్ సభలో ప్రవేశ పెడతారు.

దేశ వ్యాప్తంగా …. ఒకే సారి ఎన్నికలకు మార్గం సుగమం చేస్తూ ఈ అంశాన్ని పరిశీలించడానికి ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయీ కమిటీ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీ రాజకీయ పార్టీలు …, సంబంధిత నిపుణులతో విస్తృత స్థాయిలో చర్చలు జరిపి సిఫారసులు రూపొందించింది.

---------------------------

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరుడైన పొట్టి శ్రీరాములు వర్ధంతి ఈరోజు. 1901 మార్చి 16న మద్రాసులో జన్మించిన ఆయన భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతులయ్యారు. 1930వ సంవత్సరంలో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. క్విట్ ఇండియా ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 1952 అక్టోబర్ 19న ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి… ఆ దీక్షలోనే 1952 డిసెంబర్ 15వ తేదీన కన్నుమూశారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం బలిదానం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

---------------------------

తెలంగాణా పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య గొప్ప పోరాట యోధుడని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాదులో దొడ్డి కొమురయ్య కురుమ భవనాన్ని నిన్న ఆయన ప్రారంభిస్తూ ….సాయుధ రైతాంగ

పోరాటాన్ని ముందుండి నడిపించారని అన్నారు. రాష్ట్రంలో 98 శాతం మేర కులగణన  పూర్తయిందని.., కులగణన కార్యక్రమం మొత్తం పూర్తయిన తరువాత స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తామని రేవంత్ రెడ్డి  పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా ...... హైదరాబాదులో నిన్న జరిగిన ప్రపంచ  మాదిగ  దినోత్సవ కార్యక్రమంలో కూడా రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎస్. సి. వర్గీకరణపై నియమించిన కమిషన్ నివేదిక వారం రోజులలో వచ్చే అవకాశం ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు..

======================